నరసన్న పాపాయి

రుద్రేశ్వరం గుడియెదుట శివరాత్రి ఉత్సవంలో, గుడిలోకి రాబోయాడని మా అన్నయ్య అతన్ని చావగొట్టాడు. మా అన్నయ్య అతన్ని చావగొట్టాడు!! మా అన్నయ్య అతన్ని చావగొట్టాడు!!!

నిజమే. ఆ బాలుడు హరిజనుడే! అంతమాత్రాన మా అన్నయ్య వాడిని చావగొట్టడమే! ఆ కుఱ్ఱవాడు చేసినతప్పు? శివరాత్రినాడు రుద్రేశ్వరస్వామి గుడిలోకి మా అందరితోటీ రావాలని ప్రయత్నించాడు.

మేము కోనేటిలో స్నానాలుచేసి, పట్టుబట్టలు కట్టుకొని, పళ్ళూ కొబ్బరికాయలూ పువ్వులూ ఆరతి కర్పూరం ఊదువత్తులు మొదలయినవి పట్టుకు బయలుదేరాం. మా ఊరుకు రుద్రేశ్వరం ఎనిమిదిమైళ్ళు ఉంటుంది. రాత్రి బళ్ళు కట్టుకు బయలుదేరాం. తెల్లవారగట్లకు రుద్రేశ్వరం వచ్చాం. మా రెండెడ్లబండే మాకు దేరా అయింది. దానిచుట్టూ తెరలు కట్టుకున్నాం. చాపలు కట్టాం. వంటలకు అన్ని సరంజాములు మా అమ్మ చేసింది. ఆతర్వాతనే తెలతెల్లవారేసరికి కోనేరులో దిగాం.

ఆ బాలుడు మావూరు పెద్దమాలపల్లిలో వుండే అబ్బాయి. వాళ్ళ అయ్య మా వూళ్ళోఉన్న కరణంగారి పాలేరు.

మా అన్నయ్య వాడిని చావకొడుతూ వుంటే వాడు పెట్టినగోల రాతినైనా కరిగిస్తుంది. నేను వెక్కి వెక్కి ఏడ్చాను. ఆ అబ్బాయి సొమ్మసిల్లి మూర్ఛపోయాడు. నేను ముందుకు పరుగెత్తి వాడిమీద నా చెంబులో వున్న నీళ్ళు చల్లాను. వాడికి మెలుకువ వచ్చి లేచి గుండెలు కరిగిపోయేటట్లు ఏడుస్తూ తూలుతూ నడిచిపోయాడు.

నాకు నరసన్న ఏడుపు వినిపిస్తున్నది. స్వామికి అర్చన చేయించే పూజారి మంత్రాలు వాడి ఏడుపులా వున్నవి. గుడిలో మ్రోగించే గంటలు వాడు యెక్కి యెక్కి రోదించినట్లే వున్నవి. నేను అప్పుడు చిన్న బిడ్డనే అయినా నాకు నరసన్నను మా అన్నయ్య కొట్టడం నన్నే కొట్టినట్లయింది. నన్నుకూడా మా అన్నయ్య కొడ్తాడేమో అనిపించింది. నేనూ వెక్కి వెక్కి ఏడ్చాను. నాకు ఎనిమిది సంవత్సరాలు ఈడుంటుంది.

"ఒసే రవణా! ఎందుకే యింకా ఏడుస్తున్నావు?" అని మా అమ్మ కొంచెం ఘాటుగా అడిగింది.

"దానిని రెండువేస్తే వూరుకుంటుంది" అని మా అన్నయ్య. ఎంత కోపం? మా అన్నయ్యకు నేను వూరికే భయపడ్డానా? వచ్చిన వేలకొలది జనంలో తొక్కిసలాడుతూ బయటకు వచ్చాం.

నరసన్న ఏడుపు, జనకోలాహలం, డప్పులు, బూరాలు, 'శివ శివ శివోహం' అనే భక్తుల కేకలు నా నిశ్శబ్దబాష్పాలు, మా అన్నయ్య నన్ను తిట్టడం, మా అమ్మ నన్ను కేకలు వెయ్యడం, నరసన్న ఏడుపు, ఏడుపు! మా అన్నయ్య వాణ్ణి గుళ్ళోకి వస్తున్నాడని చావకొట్టాడు.

నరసన్న పెద్దవాడయ్యాడు. నేనూ పెద్దదాన్నయ్యాను. నాకూ పెళ్ళయింది. నరసన్నకూ పెళ్ళయింది.

రుద్రేశ్వరం గుడియెదుట మా అన్నయ్య శివరాత్రి ఉత్సవంలో వాడు గుడిలోకి రాబోయాడని అతన్ని చావగొట్టాడు. అది నా పెళ్ళిలోనూ నాకు జ్ఞాపకమే! వాడికి పెళ్ళి అవుతోందంటేనూ నాకు జ్ఞాపకమే!

నరసన్న మా అత్తవారికి పెద్దపాలేరయ్యాడు. ఆ వూరికి పెద్దమాల అయ్యాడు. కాని గుడియెదుట వాణ్ణి మా అన్నయ్య కొట్టితే వాడు ఏడ్చిన ఏడుపే నాకు స్నేహితురాలయింది. అదే నాకూ నరసన్నకూ మధ్య ఏదో విచిత్రమైన పవిత్రమైన సంబంధం ఏర్పాటు చేసింది.

మా అన్నయ్య అతన్ని కొట్టిన సంగతి నేను మరచిపోలేదు. మా అన్నయ్యే మరచిపోయాడు. ఆ కొట్టడం చూస్తు వున్న మా అమ్మావాళ్ళూ మరచిపోయారు. ఆఖరుకు నరసన్న మరచిపోయాడు.

"ఏమయ్యా నరసన్నా! నీ భార్య కడుపుతో వుందట!"

"అవునండీ ఖామందుగారూ!" అన్న అతని మొగం పూవులా వికసించింది.

నరసన్న ఒడ్డూ పొడుగూ అయ్యాడు. నరసన్న నల్లని రాయిచెక్కిన విగ్రహంలా మూర్తితాల్చాడు.

నరసన్నకు చదువులేదు. కాని వాడు చెప్పిన సలహా తిమ్మరుసు సలహా!

నరసన్న మా పాలేరు అవడానికి నేనే కారకురాలిని. అతడు మా పాలేరయినందుకు మాకు కోటి విధాల లాభమే అయింది. ఆ వూళ్ళో (మా వూరు 'పాడు') మా పొలంలా పండే భూమేది?

నరసన్న రుద్రేశ్వరం శివరాత్రి వుత్సవంలో గుడిలోకి వెళ్ళబోతూవుంటే మా అన్నయ్య అతన్ని చావగొట్టాడు!

మాలలూ మాదిగలూ యెన్ని సార్లు పెద్దకులాల వారిచే దెబ్బలు తినలేదు!

మాలలూ మాదిగలూ యెంతమంది క్రిష్టియన్ మతంలో చేరలేదు!

మాలలూ మాదిగలూ మాకు దూరంగా వుండాలి! మేము అంటు అవుతాము. నరసన్న భార్యను యెవరూ చూడకుండా నా దగ్గరకు రమ్మనేదాన్ని. నా తల దువ్వమనేదాన్ని, రత్తాలు మొదట నవ్వేసింది. తర్వాత నా బ్రతిమాలడాలు, నా కోపపడడాలవల్లా భయపడుతూ ఒప్పుకొని నాకు తల దువ్వింది. నా ఒళ్ళు ఝల్లుమంది. నరసన్న రుద్రేశ్వరం గుడిలోకి వెళ్ళినట్లయింది. గుడిలోకి వెళ్ళినా వెళ్ళని నేను! గుడిలోకి వెళ్ళబోయే మా అన్నయ్య చేత దెబ్బలు తిన్న నరసన్న! నరసన్న భార్య నాకు తలదువ్వింది. నేను నరసన్న భార్య రత్తాలు తల దువ్వాను.

ఓట్ల రోజులు. కాంగ్రెసువారికీ, కమ్యూనిస్టులకూ పోటీ.

మాల మాదిగలలో - వాళ్ళని హరిజనులంటారు - కాంగ్రెసువాళ్ళనీ కమ్యూనిష్టులనీ ఏదో ఫెడరేషననీ యీ ముగ్గురికీ పోటీ!

మా ఆయన నరసన్నను పోటీ చేయమన్నారు. ఆయన కాంగ్రెసువారు. నరసన్న చిన్నతనంలో చదవలేదు. కాని మా వారే రోజూ నరసన్నకు చదువు చెప్పారు. అతనికి వచ్చిన చదువు యెంతో పెద్దది. రుద్రేశ్వరుని గుడియెదుట మా అన్నయ్య కొట్టిన దెబ్బలు అతనికి ఓనమాలు.

ఎంతమంది హరిజనులు గుళ్ళయెదుట, బజారులో, అంగళ్ళవీధిలో, పొలాలలో దెబ్బలు తినటంలేదు?

వాళ్ళు ఏ దేవుణ్ణి చూడగలరు? వెంకటేశ్వరుడు, చిదంబరస్వామి, రామలింగేశ్వరుడు, శ్రీరంగశాయి వాళ్ళకు కనబడతారా? మా రుద్రేశ్వరుడే నరసన్నకు కనబడలేదు.

నరసన్న భార్య కడుపుతో వుంది! నరసన్నకు కొడుకు పుడ్తాడా. కూతురా? ఆ పాపాయికి రుద్రేశ్వరుడు కనబడడు.

"రత్తాలూ చదువుచెప్తా చదువుకోవూ?" అన్నాను.

"నాకు చదువెందుకండీ కామందుగోరూ!" అన్నది రత్తాలు పకపక నవ్వుతూ! నరసన్న మాకు పాలేరయిన కొద్దిరోజులకు రత్తాలుతో అలా అన్నాను. అంతటితో వదిలానా రత్తాలుచేత 'వీరవల్లడు' చదివించాను.

నాకు బాగా చదువు చెప్పించారు మావాళ్ళు. ఇంటి దగ్గిరే ఇంగ్లీషు చదవా! మావారు ఏవో బందరు వెళ్ళి ఇంటరుమీడియెట్ ఫేలయివచ్చి వ్యవసాయం పెట్టారు.

ఆయన "మన నరసన్న హరిజనుడు రవణా! ఎన్ని శతాబ్దాలనుంచి వాళ్ళు అలా బాధపడుతున్నారూ? వాళ్ళు మనుష్యులు కాదనా మనవాళ్ళు రవణా!" అని నన్ను దగ్గిరకు చేర్చి ఏదో తనలో అనుకున్నట్లుగా అన్నాడు.

"నరసన్నను మా అన్నయ్య కొట్టాడండీ!"

"ఎప్పుడూ?" ఆయన ఆదుర్దా యెంతో మూర్తితాల్చింది.

"చిన్నతనంలోనండీ! రుద్రేశ్వరస్వామి గుళ్ళోకి రాబోయాడు. మా అన్నయ్య వాణ్ణెరుగును. మా అన్నయ్య చావగొట్టాడు!" చిన్ననాటి ఆ దృశ్యం అంతా జ్ఞాపకం వచ్చి నాకూ కళ్ళనీళ్ళు తిరిగాయి.

మావారు నన్ను తన హృదయానికి పొదివికొని, "నీ హృదయం నవనీతం రవణా" అన్నారు. ఆయన ముద్దులు నాకు గాఢమైన ఆనందమూ, యెంతో సిగ్గూ కలిగిస్తాయి.

"నరసన్న భార్యకు తలదువ్వాను!" నా కళ్ళల్లో భయమూ, ఏమంటారు యిక అన్న అల్లరితనమూ రెండూ నర్తించాయి.

ఇక నన్ను మావారు తన కౌగిలిలో నలిపివేశారు. నా రవికముడి వీడిపోయినా, నాకు సిగ్గు పొంగుకువచ్చినా ఆయనకేమీ! అల్లరి అబ్బాయి.

"రత్తాలు పాపాయి నెత్తుకుంటుంది!" ఆయన కళ్ళు నా కళ్ళల్లోకి అతి గాఢంగా చూచాయి.

నా కంటిరెప్పలు అరమూతలుగా వాలినవి.

"ఆ పాపాయి రుద్రేశ్వరం గుడిలోకి వెళ్తాడా అండీ?"

"రుద్రేశ్వరమే? కాశీ విశ్వేశ్వరమే!"

"ఆ పాపాయిని మా అన్నయ్య వంటివారు ఎవ్వరూ కొట్టరు కదాండీ" నా గుండె దడదడలాడింది.

రత్తాలు పురిటికి కష్టం అయింది. అంత బండలాంటి నరసన్న ఒకటేగోల!

మా వారు పెద్ద డాక్టర్ని తీసుకువచ్చారు.

రత్తాల్ని వాళ్ళ గూడెంలో గుడిసెనుండి మా ఇంటికి తీసుకువచ్చారు. మా దంపుళ్ళగది పురిటిగది అయింది.

డాక్టరుగారు మూడుగంటలు కష్టపడ్డారు. నరసన్న కూతురు ప్రపంచ రంగంలో ప్రవేశించి 'కేరు' మంది.

నేను లోపలికి పరుగెత్తాను. సిద్దిలా చేతులు కాళ్ళూ ఆడిస్తూ అల్లరిచేస్తూంది ఆ పాపాయి.

ఇంకో హరిజన పాపాయి ప్రపంచంలోకి వచ్చింది. అదీ విసిరేసినట్లు ఊరిబయట! దానికి చింపిబట్టలు. దానికీ తలదువ్వుకోటానికి నూనె వుండదు! దానికీ చదువు వుండదు! దానికీ కడుపునిండా తినడానికి తిండి వుండదు! అదీ రుద్రేశ్వరం గుడియెదుట గుళ్ళోకి వెళ్ళబోయి ఏ మా అన్నయ్యవల్లనో తన్నులు తినాలి.

నాకు దడదడయెత్తి ముచ్చెమ్మటలు పోశాయి. నరసన్నను మా అన్నయ్య రుద్రేశ్వరం దేవాలయం ఎదుట శివరాత్రినాడు చావగొట్టాడు కాదూ!

ఆ హరిజన పాపాయీ వాళ్ళమ్మా నీళ్ళు పోసుకుని వాళ్ళ గూడెం వెళ్ళిపోయారు. చిట్టి కృష్ణునిలా తయారయింది ఆ చిట్టిపాప. పదిహేను రోజులలో వుంగరాల జుట్టు, అల్లనేరేడు పండులాంటి ముక్కు, నల్ల దొండ పళ్ళు దాని పెదవులు. గవ్వలలాంటి వేళ్ళు, ఆ బొజ్జ, ఆ చిన్న కాళ్ళు, ఆ చిన్నారి చేతులు అందాలు ఒలకపోసుకుంటూ, నులక మంచంమీద దొర్లడమే! నేనూ మా ఆయనా రాత్రిళ్ళప్పుడు నరసన్న ఇంటికిపోయి, రత్తాలునీ, పాపాయినీ చూసి వచ్చేవాళ్ళం!

నా చీరలూ, దుప్పట్లూ, దోళ్ళ దోపిడీ ఇచ్చాను. ఆ చిన్న పాపాయికి చిట్టిచొక్కాలు ఎన్నో కుట్టి ఇచ్చాను. ఆ ముద్దుపాపను చూచినప్పుడల్లా మా ఆయన చిన్నపాపడై కన్పించేవారు. నా రవిక జేబులు పిక్కటిల్లేవి.

ఊళ్ళోవాళ్ళు మేము కులం నాశనం చేశామని తిట్టుకుంటున్నారట. రాములవారిలా ఆజానుబాహువులు కలవారూ, అందమైనవారూ, బంగారం ఛాయ కలవారూ, సాధుమూర్తీ అయిన మా వారంటే అందరికీ భయమూ, భక్తీ! అయినా మమ్మల్ని అందరూ తిట్టేవారు.

వాళ్ళంతా రుద్రేశ్వర దేవాలయంలోకి నరసన్నవంటి హరిజన బాలకులు వస్తే చావగొట్టే జాతివాళ్ళు! మా అన్నయ్య నరసన్నను ఒక శివరాత్రినాడు చావకొట్టాడు. మా

అన్నయ్య మా ఇంటికి మేం నరసన్న భార్యను పురిటికి తీసుకు వచ్చినప్పటినుండీ రావడం మానివేశాడు. నరసన్నే నాకు అన్న! 'అవును రవణా! రుద్రేశం తల్లి కడుపున బుట్టిన అతడే నీకు అన్న! అతడే మనకింత తిండి పెడుతున్నాడు!" అని వెన్నెలలాంటి చిరునవ్వు నవ్వుతూ మా ఆయన అన్నారు.

మావారు భగవంతులే!

నరసన్న ఎన్నికలలో నెగ్గాడు. చెన్నపట్టణం శాసనసభకు సభ్యుడట.

ఆరోజు మావారు కాంగ్రెసు నాయకులకూ ఊళ్ళవారందరికీ విందుచేశారు. నరసన్న మా వారిపక్కనే కూర్చున్నాడు విందులో.

మా నరసన్న, నరసన్నగారు సభ్యుడు. ఇప్పుడూ మా అన్నయ్య నరసన్నను కొడతాడా రుద్రేశ్వరం గుడి ఎదుట! ఏమో, మా అన్నయ్య ఎంతకైనా తగును!

నరసన్నకు మా దంపుళ్ళసావిడి అయిదు వందల రూపాయలు పెట్టి చక్కని ఇల్లులా సిద్ధంచేసి మావారు అందులో ప్రవేశించబెట్టారు. ఇంక మా స్థితి? నాకు నరసన్న పాపాయి ఆప్తురాలు.

"నేనూ, నరసన్న భార్య రత్తాలూ–రత్నమ్మా, ఖద్దరు వడకడం ప్రారంభించాము. మావారు ఎప్పటినుంచో ఖద్దరు కడుతున్నారు. ఇప్పుడు నరసయ్య అన్నా రత్నం మరదలూ, మేనకోడలు భరతాంబా అందరూ ఖద్దరు కడుతున్నాం.

నరసన్న అన్నా, అతని కుటుంబమూ శుభ్రంగా తిండి తింటున్నారు. శుభ్రంగా బట్టలు కట్టుకుంటున్నారు. రుద్రేశ్వరదేవాలయం ఎదుట మా అన్నయ్య కొట్టిన దెబ్బలూ, అతని ఏడుపూ నరసన్నకు ఆశీర్వచనాలు!

భరతదేశంలోని హరిజనులందరూ రుద్రేశ్వరదేవాలయం యెదుట మా అన్నయ్యచేత దెబ్బలు తినాలా?

భరతదేశంలోని హరిజనులందరూ ఇంత తిండీ, ఇంత బట్టా సంపాదించు కోవాలంటే శాసన సభ్యులవ్వాలా?

ఇంతకూ మా నరసయ్యన్న పాపాయిని నేనే పెంచడం, పిల్లలులేని వాళ్ళు ఇంకోళ్ళ పాపని తెచ్చుకుపెంచుకుంటే పిల్లలు కలుగుతారంటారు. భరతాంబ నాదగ్గరే. నన్ను "అత్తా" అంటుంది. నా దగ్గిర పండుకునే నిద్రపోతే ఓ రాత్రివేళ వాళ్ళమ్మ వచ్చి తీసుకుపోయేది.

ఓ రోజున ఆ పెంకి భరతం అల్లరిచేసింది. నా దగ్గిర పడుకొని నిద్రపోయి రవిక పిన్ను ఊడిపోయి నా బంగారు నిధులు, పొడి బంగారు కలశాలు, కర్కశపు ఉబుకులు, చిన్న బుడ్డ పుణుకులు ఎరగని, పనికిరాని వట్టి అందాలు, భరతాంబ నోటితో అందిపుచ్చుకుని, పట్టి మొనలు పునకడం ప్రారంభించింది. నాకూ నిద్రపట్టింది కాబోలు. వళ్ళు ఝల్లుమని మేనెల్లా తీవులు ప్రవహించి ఆనందం ముంచెత్తి ఎవరో బంగారు పాపాయి నా గర్భం పండించి నా పాలు పుణుకుతున్నట్లయి మెలుకువ వచ్చింది. భరతం కొంటిపాప నిద్రలో పుణుకుమని వట్టి వట్టి పాలు తాగుతున్నది.

ఆసి అల్లరిదాన అని సిగ్గుపడి మా ఆయన నిద్రపోతూ ఉండటం చూచి, నెమ్మదించుకొని, దిబ్బెసలాంటి భరతాంబ పిరుదులపై రెండు చిన్న దెబ్బలు తగిలించి వాళ్ళ అమ్మని పిలిచి భరతాన్ని అందిచ్చాను.

అక్కడనుంచి రోజూ కలలు! రెండు నెలలకు నాకు నెలతప్పింది. నా కన్న, నా భరతం నాకు వరమిచ్చింది.

ఇంకా మా రత్తాలు - రత్నం - సంతోషం ఇంతా అంతా! మా ఆయన నన్ను పూజించారంటే, వారు పదహారుకళల చంద్రులయ్యారు.

తొమ్మిది నెలలలో వెన్నెల ముద్దకట్టి నాకు ఓ పాపాయి ప్రత్యక్షమైంది.

"ఆసి బంగారు తల్లీ, అచ్చంగా తండ్రి పోలిక, వదినగారూ!" అన్నది రత్నం పాపాయికి నీరుపోస్తూ!

ఈ నా కన్నతల్లి భరతాంబ మరదలు. మా వారి ప్రేమ మూర్తి కట్టిన వరలక్ష్మి, నరసన్న మా అన్నయ్యచేత దెబ్బలు తిన్నప్పుడు ఏడ్చిన ఏడుపులో ఉన్న కరుణరసం నిండిన కలశం వచ్చింది. ఆమెను మేము "పూర్ణ స్వరాజ్యలక్ష్మి" అని పేరు పెట్టుకున్నాం.